నమస్తే తెలంగాణ
నిజామాబాద్
10 | నిజామాబాద్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | NIZAMABAD

సిరికొండ మండలం చీమన్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బోర్గాం (పీ) గ్రామంలో..

అంబరమంటిన సద్దుల సంబురం

- ఉమ్మడి జిల్లాలో వైభవంగా పూలపండుగ
- 'మళ్లీ రా బతుకమ్మ' అంటూ వీడ్కోలు పలికిన మహిళలు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబురాలు ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటాయి. ఎనిమిదిరోజులపాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడిపాడిన మహిళలు గురువారం సద్దుల బతుకమ్మను అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఊరూవాడా పూలవనాలను తలపించాయి. ఆడపడుచులు గౌరి దేవీని కీర్తిస్తూ పాటలు పాడారు. మహిళలందరూ ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి లయబద్ధంగా తిరుగుతూ పాటలు పాడారు. సకల సౌభాగ్యాలు అందించుమా... మళ్లీ వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా అంటూ వీడ్కోలు పలికారు. పసుపు, బొట్లు, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగించారు.

–సుభాష్‌నగర్, కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని పూలాంగ్‌వాగులో బతుకమ్మల నిమజ్జనం

బతుకమ్మ సంబురాల్లో యువతుల సెల్ఫీ

జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

ఇందల్వాయి మండలం గన్నారంలో బతుకమ్మలను నిమజ్జనం కోసం ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

హమాల్‌వాడి సాయిబాబా ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎవరిని ఏడ పెట్టాలో బాగా తెలుసు

- కొందరు దుర్మార్గులు అభివృద్ధికి అడ్డం పడుతుండ్రు
- కేసీఆర్ దయ వల్ల పేదలకు ఇండ్లు అచ్చినయ్
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

రుద్రూర్, అక్టోబర్ 10: 'రాజకీయంగా నాకు చాలా అనుభవం ఉంది. ఎవరిని ఏడ పెట్టాలో నాకు బాగా తెలుసని' బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కొందరు దుర్మార్గులు అభివృద్ధికి అడ్డం పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దయ వల్ల బాన్సువాడలో పేదలకు ఇండ్లు వచ్చాయన్నారు. వర్నిలో గురువారం నిర్వహించిన స్థానిక ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారంలో పోచారం మాట్లాడారు. కాంగ్రెస్‌లోకి తాము వస్తుంటే కొందరు స్వాగతించారని, మరికొందరు దుర్మార్గులు అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. అనవసరంగా రాజకీయం చేసి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. లేదంటే ఎవరిని ఎక్కడ పెట్టాలో తనకు తెలుసన్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డిని బాన్సువాడలో అడుగు పెట్టొద్దని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పినా వినకుండా కొంతమందిని రెచ్చగొట్టి, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ దయ వల్ల పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందాయని, ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నదని, నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. అర్హుల జాబితా తయారు చేయాలని అధికారులకు సూచించారు. త్వరలోనే రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్‌లు, ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీలో అవకతవకలు జరిగాయని, నూతన కార్యవర్గం ఎలాంటి అక్రమాలకూ చోటివ్వకుండా అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు. రుణమాఫీ కాని రైతుల కోసం త్వరలోనే రూ.13 వేల కోట్లు విడుదల చేయనున్నట్లు ఎంపీ సురేశ్ షెట్కార్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, నేతలు పోచారం భాస్కర్‌రెడ్డి, కూనీపూర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్
- కేసీఆర్ ప్రవేశపెట్టిన 'లక్ష' ఇస్తున్నారే తప్ప.. తులం బంగారం జాడలేదు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్/ మెండోరా/ ఏర్గట్ల, అక్టోబర్ 10: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కి, ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్యాణ లక్ష్మి కింద ఇచ్చే రూ. లక్ష ఇస్తున్నారే తప్ప.. తులం బంగారం ఇవ్వడంలేదని మండిపడ్డారు. తులం బంగారం ఎప్పుడిస్తారని సీఎం రేవంత్‌రెడ్డిని వేముల ప్రశ్నించారు. గురువారం ఆయన ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండల కేంద్రాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కాలం దగ్గర పడుతున్నదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలుచేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆడబిడ్డల కుటుంబాలకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఎంతో మంది పేద ఆడబిడ్డల కుటుంబాలను ఆదుకున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన లక్ష రూపాయలు మాత్రమే ప్రస్తుత రేవంత్ సర్కారు ఇస్తున్నదని, తులం బంగారం మాత్రం ఇవ్వడంలేదని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు.

సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తల యత్నం

ముప్కాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల మాట్లాడుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు సభను అడ్డుకునే యత్నం చేశారు. తులం బంగారం ఎక్కడ అని వేముల ప్రశ్నించడంతో సభను రసాభాసగా మార్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని కాంగ్రెస్ కార్యకర్తలను బయటికి పంపించారు. ఇదిలా ఉండగా.. ఏర్గట్లలో చెక్కుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నంత సేపు రైతువేదిక ఆవరణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేసుకున్నారు.

త్వరగా పరిహారం అందేలా చూడాలి

- ఆర్డీవోలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ ఆదేశం

కంఠేశ్వర్, అక్టోబర్ 10 : గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృతి చెందినా, లేదా తీవ్రంగా గాయపడిన (హిట్ అండ్ రన్) కేసుల్లో బాధితులకు, వారి కుటుంబాలకు నష్టపరిహారం త్వరగా అందేలా విచారణ చేపట్టాలని ఆర్డీవోలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో హిట్ అండ్ రన్ కేసుల జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 32 హిట్ అండ్ రన్ కేసులు నమోదవగా, వాటిలో 27 ప్రమాద ఘటనలకు సంబంధించి బాధిత కుటుంబాలు గుర్తించినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందులో నిజామాబాద్ డివిజన్ పరిధిలో 17, ఆర్మూర్‌లో 7, బోధన్‌లో మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో మృతిచెందితే చట్టప్రకారం సాధారణ బీమా కౌన్సిల్ ద్వారా బాధిత కుటుంబీకులకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడితే రూ.50 వేలు నష్టపరిహారం అందించాల్సి ఉంటుందని తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకుని బాధితులకు పరిహారం మంజూరు చేసేలా త్వరితగతిన సమగ్ర విచారణ చేపట్టి నివేదికలు సమర్పించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, అదే సమయంలో అన్ని వివరాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు.